
వనస్థలిపురం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి


పునఃప్రారంభం కావడంతో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు


సరూర్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


బహదూర్‌గూడ జడ్‌పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయ ప్రతినిధులు

మోగిన బడిగంట..

- విద్యార్థులతో సందడిగా మారిన పాఠశాలలు
- ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం అందజేత


పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల

రెండు నెలల వేసవి సెలవుల అనంతరం బుధవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, చంపాపేట, చాదర్‌ఘాట్, మలక్‌పేట్, వనస్థలిపురం, కొత్తపేట, సైదాబాద్, హాయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు చిన్నారులతో సందడిగా కనిపించాయి. ఆయా పాఠశాల్లో విద్యార్థులకు స్కూల్‌బ్యాగులు, పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పాల్గొన్నారు.

- ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ బృందం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి)


చంపాపేట ఉన్నత పాఠశాలలో ప్రార్థనకు హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు


బాగ్ ముసారిమో ప్రభుత్వ పాఠశాలలో డిప్యూటీ డీఈవో రాధాకృష్ణతో కలిసి పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్


గడ్డిఅన్నారంలో విద్యార్థులకు నోట్ బుక్‌లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి


అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్, యూనిఫాంను అందజేస్తున్న ఎంపీపీ రేఖ


శంకేశ్వర్‌బజార్‌లో కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి, ఉప విద్యాశాఖాధికారి రాధాకృష్ణ


కవాడిపల్లి ప్రభుత్వ పాఠశాలకు కట్టిన మామిడి తోరణాలు...పక్కన విద్యార్థులు, ఉపాధ్యాయులు


హయత్‌నగర్ జెడ్‌పీహెచ్‌ఎస్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందిస్తున్న కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డి


బడంగ్‌పేట్ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేస్తున్న మేయర్ పారిజాతారెడ్డి, డిప్యూటీ మేయర్ శేఖర్

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

ఎల్‌బీనగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో యాత్రికుల బస్సుపై ఉగ్రవాదుల దాడిని బజరంగ్‌దళ్ వివేకానంద జిల్లా కన్వీనర్ ముద్దం మహేష్ యాదవ్ ఖండించారు. బజరంగ్‌దళ్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం విశ్వ హిందూపరిషత్ వివేకానంద జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ చౌరస్తాలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదులకు అండగా నిలిచే వారిని దేశం నుంచి తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ జిల్లాస్థాయి ప్రతినిధులు పాల్గొన్నారు.


విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న సినీనటి, బిగ్ బాస్ 7 ఫేమ్ రితిక రోస్

ఫ్యాషన్ డిజైనింగ్‌కు 23న స్కాలర్‌షిప్ టెస్టు

చాదర్‌ఘాట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ చైతన్యపురి ఆధ్వర్యంలో ఫ్యాషన్ డిజైనింగ్ డిప్లొమా, డిగ్రీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల కోసం స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ కన్నెబోయిన రాముయాదవ్ తెలిపారు. ఈనెల 23న రెండు విడతలుగా నిర్వహించనున్న స్కాలర్‌షిప్ పరీక్షకు ఈనెల 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. మొదటి విడత పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు 2024 విద్యా సంవత్సరానికి రూ.12 లక్షల చెక్కును ప్రముఖ సినీనటి, బిగ్ బాస్ 7 ఫేమ్ రితిక రోస్ అందజేశారు. రెండో విడత స్కాలర్ షిప్ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకునేందుకు 9030610033, 9849167839లో సంప్రదించవచ్చు.

ముగిసిన రాధక్క అంత్యక్రియలు

సైదాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గోదావరి లోయ ప్రతిఘటనా పోరాట నిర్మాణంలో ముఖ్యభూమిక పోషించిన విప్లవోద్యమ నాయకురాలు రాధక్క(86) అంత్యక్రియలు గురువారం ఉదయం సైదాబాద్ దోబీఘాట్ శ్మశానవాటికలో నిర్వహించనున్నారు. రాధక్క పార్థివదేహం వద్ద సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.డీ.అబ్బాస్, జిల్లా నాయకులు నాగేశ్వర్, విఠల్, బాలు నాయక్, శ్రావణ్‌కుమార్ పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

ఆదిత్యానగర్ కాలనీ రోడ్డును బాగు చేయాలి

సరూర్‌నగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ గుర్రంగూడ 7వ డివిజన్‌లోని ఆదిత్యానగర్ కాలనీ రోడ్డును బాగు చేయాలని కాలనీవాసులు మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డిని కోరారు. బుధవారం మాజీ కౌన్సిలర్ గుర్రం సాయికిరణ్‌రెడ్డితో కలిసి సబితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరైనా పనులు ముందుకు సాగడం లేదని, ఆరు నెలల క్రితం కంకర పరిచి వదిలేశారని, దాంతో ఇబ్బందులు కలుగుతున్నాయని వాపోయారు. సబిత స్పందిస్తూ అధికారులతో మాట్లాడి పనులు తొందరగా మొదలయ్యేలా చూస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పుట్టగల్ల సంజీవ, అర్ల శ్రీశైలం పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఓ రియల్ వ్యాపారి అదృశ్యం

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 12: ఆర్థిక ఇబ్బందులతో ఓ రియల్ వ్యాపారి అదృశ్యమైన సంఘటన పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ బద్దం నాగార్జున్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపాలిటీలోని సద్భావన టౌన్‌షిప్‌కు చెందిన గారె ప్రసాద్(41) రియల్ వ్యాపారం చేస్తుంటాడు. ఈ నెల 10న ప్రసాద్ ఇంట్లో ఫోన్ పెట్టి బయటకు వెళ్తున్నానని కుటుంబసభ్యులకు చెప్పి వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, మిత్రులను, బంధువులను విచారించిన అచూకీ లభ్యం కాలేదు. దీంతో ప్రసాద్ కుటుంబసభ్యులు బుధవారం పోచారం ఐటీసీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వ భూముల్లో పాతిన హద్దురాళ్ల తొలగింపు

జవహర్‌నగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వభూముల్లో హద్దురాళ్లను తొలగించి ప్రభుత్వభూమి హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేసినట్లు ఆర్‌ఐ శ్రీలక్ష్మీ తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని సర్వేనంబర్ 266లో అక్రమంగా వేసిన ఫెన్సింగ్‌ను, సర్వేనంబర్ 249లో ప్లాట్లు చేసిన హద్దురాళ్లను, సర్వేనంబర్ 502లో వేసిన షెడ్‌ను రెవెన్యూ అధికారులు బుధవారం తొలగించారు. సర్వేనం.502, 682,701, 702, 703లలో ప్రభుత్వ భూమి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారన్నారు. అక్రమ నిర్మాణాలు చేస్తే క్రిమినల్ కేసులు పెడతామని ఆర్‌ఐ శ్రీలక్ష్మి హెచ్చరించారు.

వేంకటేశ్వర ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కొత్తపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): స్నేహపురి శ్రీ గోదా సమేత పద్మావతీ వేంకటేశ్వర ఆలయ దేవస్థానం బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. మధ్వాధూల రమాకాంతాచార్య స్వామి అధ్వర్యంలో స్వామి వార్లకు ప్రత్యేక ఆరాధన, విశేష విష్ణు సహస్రనామ పారాయణం, హవిర్నివేదనం తదితర పూజలు నిర్వహించారు. ధర్మకర్తల మండలి పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ వారణాశి వంశీ, కార్యదర్శి ప్రసన్న కృష్ణ, కోశాధికారి హేమసుందర్ రావు, ట్రస్టీ అనంతుల సురేందర్ రెడ్డి, మేనేజర్ రవి భక్తులకు ఏర్పాట్లు చేశారు. గురువారం సాయంత్రం శ్రీ లాస్య నృత్యాలయ విశాఖ ప్రకాష్ శిష్య బృందం "శ్రీవాస కళ్యాణం" భరతనాట్య రూపకం ప్రదర్శించనున్నారు.


బ్రహ్మోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

మహిళను బెదిరించి రూ.6.45లక్షల లూటీ

హైదరాబాద్ సిటీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సీబీఐ దర్యాప్తు చేస్తున్న మనీలాండరింగ్ కేసులో మీ బ్యాంకు ఖాతా నుంచి లావాదేవీలు జరిగాయని బెదిరించిన సైబర్ నేరగాళ్లు ఆమె ఖాతా నుంచి రూ.6.45 లక్షలు లూటీ చేశారు. షాక్ నుంచి తేరుకున్న మహిళ మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఓ గృహిణికి ఇటీవల గుర్తుతెలియని నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. అవతలి వ్యక్తి తాను టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయ్) నుంచి మాట్లాడుతున్నానని పరిచయం చేసుకున్నాడు. ముంబైలోని కనకియా పోలీస్‌స్టేషన్‌లో మీపై కేసు నమోదైంది. మీ ఫోన్ నంబర్ నుంచి అసభ్య మెసేజ్‌లు, నేరపూరితమైన నకిలీ ప్రకటనలు సర్క్యులేట్ అయినట్లు, మీ బ్యాంకు ఖాతా నుంచి అక్రమ ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు తేలిందని చెప్పాడు. మీపై నమోదైన క్రిమినల్ కేసుకు సంబంధించి పూర్తి ఆధారాలు చూపిస్తామని నమ్మించిన నేరగాళ్లు.. బాధితురాలితో స్కైప్ కాల్‌లో మాట్లాడారు. ఆమె ఆధార్ కార్డు, కెనరా బ్యాంకు ఖాతాలో లింకు చేసిన ఆధార్ కార్డు అక్కటే అని చూపించారు. ఈ కేసును సీబీఐ అధికారులు విచారిస్తున్నారని, సుప్రీం కోర్టు నుంచి మీపై అరెస్టు వారెంట్ జారీ అయిందని చూపించారు.

జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు నరేష్ గోయల్ చేసిన రూ.200 కోట్ల కుంభకోణంలో మీ పాత్ర ఉన్నట్లు, ఆ మనీ లాండరింగ్‌లో మీ కెనరా బ్యాంకు ఖాతా నుంచి అక్రమ లావాదేవీలు జరిగినట్లు ఆధారాలు లభించాయని నకిలీ పత్రాలు చూపించి భయపెట్టారు. ఏ క్షణమైనా మిమ్మల్ని అరెస్టు చేస్తారని బెదిరించారు. ఈ కేసులోంచి బయటపడాలంటే మీ ఖాతాలో ఉన్న నగదు మొత్తాన్ని ఆర్‌బీఐ ఆధీనంలో ఉన్న ఖాతాకు బదిలీ చేయండి, మీ అకౌంట్ లావాదేవీలు అన్ని సక్రమంగానే ఉన్నాయని తేల్చిన తర్వాత మీ డబ్బులు యథావిధిగా మీ ఖాతాలో జమ చేస్తారని నమ్మించారు. దాంతో బాధిత మహిళ తన ఖాతాలోని డబ్బులు వారు చెప్పిన అకౌంట్‌కు బదిలీ చేసింది. ఆ వెంటనే నిందితులు కాల్ కట్ చేశారు. తర్వాత షాక్ నుంచి కోలుకున్న మహిళ జరిగిన విషయం కుటుంబ సభ్యులకు చెప్పింది. ఇదంతో ఏదో మోసంలా ఉందని గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యర్థాల తొలగింపునకు 30 వేల కవర్లు

బక్రీద్ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం

చాదర్‌ఘాట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న బక్రీద్ సందర్భంగా పశువుల వ్యర్థాల తొలగింపు కోసం జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 పరిధిలోని ఏడు డివిజన్లలో 30 వేల కవర్లను పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు. ఈ మేరకు బుధవారం మలక్‌పేటలోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఎమ్మెల్యే అహ్మద్ బలాల, డిప్యూటీ కమిషనర్ జయంత్, శానిటేషన్ సూపర్‌వైజర్ గోవింద్‌రెడ్డి, జవాన్లు రమేష్, నర్సింగ్‌రావు, యాదయ్య, యాదగిరి, సూర్యప్రకాష్, నరేష్, సంజయ్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. బక్రీద్ సందర్భంగా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. బక్రీద్ పర్వదినం సోమవారమైన ప్పటికీ, మంగళ, బుధవారాల్లో కూడా పశువుల వ్యర్థాల తొలగింపు పనులు నిర్వహించేందుకు 11 ఎక్స్‌కవేటర్లు, 29 లారీలు, ఒక బాబ్ కట్‌ను సిద్ధం చేశారు. ఏడు డివిజన్లలో కార్పొరేటర్ల ద్వారా, మసీదుల్లో శానిటేషన్ సిబ్బంది ద్వారా కవర్ల పంపిణీకి ఏర్పాటు చేశారు. డబీర్‌పుర, చాదర్‌ఘాట్, సైదాబాద్, మలక్‌పేట పోలీస్‌స్టేషన్లలో కూడా కవర్లను పంపిణీ చేయనున్నారు. డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ జయంత్ పర్యవేక్షణలో శానిటేషన్ డిప్యూటీ ఈఈ వెంకటరాజు, శానిటేషన్ సూపర్‌వైజర్ గోవింద్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. వివాదాస్పద స్థలాల్లో పశువుల వ్యర్థాల తొలగింపునకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేశారు. సమావేశంలో కార్పొరేటర్లు మిన్హాజుద్దీన్, సలాం షాహిద్ మూన్, ఎంఐఎం నాయకులు సైపుద్దీన్ షఫీ, సయ్యద్ అలీం పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బలాల, పక్కన జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 డీసీ జయంత్, శానిటేషన్ సూపర్‌వైజర్ గోవింద్‌రెడ్డి

ఆర్థిక వ్యత్యాసాలను సరిదిద్దడంలో విఫలం

ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ మల్టీస్టేట్ చైర్మన్ రాఘవేంద్రరావు

ఎల్‌బీనగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక వ్యత్యాసాలను సరిదిద్దడంలో పాలకవర్గాలు వెనుకబడిపోయాయని ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ మల్టీస్టేట్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. బ్యాంక్ హైదరాబాద్ జోన్ శాఖల సంప్రదింపుల కమిటీ సభ్యుల సదస్సు బుధవారం ఆర్‌బీఐ మాజీ అధికారి, డైరెక్టర్ డాక్టర్ ఆర్.వైద్యనాథన్ అధ్యక్షతన కొత్తపేటలోని నక్షత్ర హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు వెసులుబాటు కల్పిస్తూ దేశంలోని పేదలను మరింత పేదలుగా చేస్తున్నారని విమర్శించారు. డైరెక్టర్లు చలికాని కృష్ణమోహన్‌రావు, ఆచల రామకృష్ణారావు, పి.నారాయణస్వామి, వైద్యనాథన్‌లు మాట్లాడుతూ ఆర్బీఐ తీసుకొచ్చిన నిబంధనలు, షరతుల ద్వారా సహకార బ్యాంకుల ఖాతాదారులకు వస్తున్న కష్టాలు, వాటిని అధిగమించడానికి పాలకవర్గం, సిబ్బంది, సంప్రదింపుల కమిటీ ప్రతినిధులు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. సదస్సులో హైదరాబాద్ జోనల్ మేనేజర్ ప్రసాద్‌రావు, బ్రాంచ్ మేనేజర్లు, సిబ్బంది, పాలకవర్గం సంప్రదింపుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ మల్టీస్టేట్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు

సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన డబ్బు రికవరీ

- వృద్ధునికి రూ.50.22 లక్షల చెక్కు అందజేత

హైదరాబాద్ సిటీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): క్రైమ్ బ్రాంచి పోలీసులం అంటూ ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు.. నగరానికి చెందిన 74 ఏళ్ల వృద్ధున్ని భయభ్రాంతులకు గురిచేసి, మాదక ద్రవ్యాల కేసులో అరెస్టు చేస్తున్నామంటూ బెదిరించి రూ. 50లక్షలకు పైగా కొల్లగొట్టారు. ఆ తర్వాత కంగుతిన్న బాధితుడు 1930కు ఫోన్ చేసి, సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన పోలీసులు సాంకేతిక ఆధారాలను సేకరించి సైబర్ నేరగాళ్లు కొట్టేసిన డబ్బును ఆయా బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేశారు. ఎక్కడెక్కడ ఎంత డబ్బు ఫ్రీజ్ చేశారో డేటాను సైబర్ క్రైమ్ పోలీసులకు అందించారు. బ్యాంకుల సహకారంతో డబ్బులను రికవరీ చేసిన పోలీసులు.. బాధితుడు పోగొట్టుకున్న రూ. 50.22లక్షలను చెక్కు రూపంలో డీసీపీ కవిత ధార అందజేశారు. ఆల్ సెట్స్ మస్ట్


బాధితునికి రూ. 50.22లక్షల చెక్కును అందజేస్తున్న సైబర్ క్రైమ్ డీసీపీ కవిత ధార

రైల్వే డిగ్రీ కళాశాలలో నూతన కోర్సులు

చిలకలగూడ,జూన్12(ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరానికి తార్నాక రైల్వే డిగ్రీ కళాశాలో ప్రవేశానికి దోస్త్ ఆన్‌లైన్ కోటాలో దరఖాస్తు చేసుకోవచ్చునని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యాసంవత్సరం నుంచి బీబీఏ, బీకాం(ఫైనాన్స్) నూతన కోర్సులను ప్రవేశ పెడుతున్నట్లు, ప్రవేశానికి అన్ని కోర్సులకూ ఆన్‌లైన్ దోస్త్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 1977వ సంవత్సరంలో ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధంగా ప్రారంభమైన ఈ కళాశాలలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ ల్యాబ్‌లతో పాటు విశాలమైన ఆటస్థలం అందుబాటులో వున్నాయన్నారు. నూతనంగా బాస్కెట్‌బాల్ కోర్టు అందబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

22న హెచ్‌సీఏ టాలెంట్ హంట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఫాస్ట్ బౌలర్ల కోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ప్రత్యేకంగా టాలెంట్ హంట్ నిర్వహిస్తోందని కార్యదర్శి దేవ్‌రాజ్ తెలిపారు. ఈనెల 22వ తేదీన ఉప్పల్ స్టేడియంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ టాలెంట్ హంట్‌ను నిర్వహించనున్నామని చెప్పారు. ఆసక్తి గల క్రికెటర్లు వచ్చే శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి తమ పేర్లను హెచ్‌సీఏ అధికారిక వెబ్‌సైట్‌లో (www.hycricket.in) నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అయితే, ఈ ప్లేయర్లు గతంలో హైదరాబాద్ జట్టుకు కానీ, బీసీసీఐకి ఆడిన వారై ఉండకూడదని, ఈ టాలెంట్ హంట్ పూర్తిగా కొత్త వాళ్లకు కోసం చేపడతున్నామని దేవ్‌రాజ్ చెప్పారు.


దేవ్‌రాజ్

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

కొత్తపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నాగోల్, నువ్వుల బండకు చెందిన కంద దొరైస్వామి (64) గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఇతడు అనారోగ్యానికి గురవడంతో ఈనెల 23న గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. దొరైస్వామి ఉంటున్న షెడ్ యజమాని శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కంద దొరైస్వామి

బోనాలకు నిధులు మంజూరు చేయాలి

సైదాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బోనాలకు నిధులు మంజూరు చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సహదేవ్ యాదవ్ కోరారు. బుధవారం సైదాబాద్ ప్రధాన రహదారిలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద రోడ్డు మరమ్మతు పనులను పరిశీలించారు. బోనాలకు నిధులుమంజూరైతే పనులు చేపట్టవచ్చన్నారు. ఆయన వెంట బీజేపీ నేతలు నిరంజన్‌యాదవ్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.


రోడ్డు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న సహదేవ్ యాదవ్